


# కాలమ్ దాటని కబుర్లు

బలభద్రపాత్రుని రమణి



## నెల నెలకీ కొన్ని కులాసా కులాసా కబుర్లు

### పేరులో ఏముంది?

**మా అమ్మమ్మ పేరు** రమణమ్మగారు. వాళ్ళమ్మ సీతమ్మ. ఆవిడ అమ్మ శేషమ్మ. మా అమ్మమ్మా, తాతయ్యా వాళ్ళ పిల్లల తరానికి వచ్చేసరికి కాస్త అందంగా, నాజూకుగా వుండేట్లు మా పెద్దమ్మలకీ, అమ్మకీ, సావిత్రీ, శ్రీదేవీ, సత్యవతీ అని పేర్లు పెట్టారు. ఇంక తరువాతి తరం మాది. లక్ష్మి, వాణి, ఉమ, రమ, శాంతి, విజయ.. ఇలాంటి పేర్లు పెట్టారు.

సాధారణంగా కడుపులో వుండగా బోలెడు మొక్కులుంటాయి. ఆ దేవుళ్ళు అందరి పేర్లూ కలిసొచ్చేట్లు పిల్లలకి పెట్టుకుంటారు. సాధారణంగా తిరుపతి ఆయన పేరు కలిసేట్లు 'వెంకట', అన్నవరం ఆయన అలిగిపోకుండా 'సత్య', విజయవాడ అమ్మకి కినుకు రాకుండా 'కనక', భద్రాచలం స్వామిలో 'రామ', ఆంజనేయుడు వుండనే వుంటాడు. 'అనంత', 'మారుతీ' మొదలైనవి.. నామకరణం రోజు వంటగదిలో వున్న బామ్మగారు మొగుడి పేరు తలుచుకుని కన్నీరు పెట్టుకున్నా, తాతగారు తన తండ్రి పేరు "మరిచిపోతున్నార్రా" అన్నా అవీ కలపాల్సిందే! వెరసి "శ్రీ వేంకట అనంత సత్య రామ కనక నారసింహ మారుతీ నారాయణ దత్త జయలలిత పరమేశ్వర గణేశ వాణీ సుబ్బశ్యామ సుందర్" లాంటి పేర్లు పెట్టి, బడిలో 'శ్యామ సుందర్' అని రాయిస్తారు.

ఇలా ఓ దశాబ్దం పెద్దవాళ్ళనీ, ప్రతి గుళ్ళో వున్న అయ్యవార్లనీ తృప్తిపరుస్తూ నామకరణం ప్రహసనాలు సాగాక, మా తరువాతి తరంలో ఒక విప్లవం వచ్చింది.

ఆంధ్రదేశంలో నవలా రచయితలూ, రచయిత్రులూ అందమైన నాయికా నాయకుల పేర్లు పెట్టడం మొదలు పెట్టారు. ఒక రచయిత్రి తన నవలలో కృష్ణ చైతన్య, కృష్ణ శేఖర్, కృష్ణ కార్తీక్, కృష్ణ సమీర్, కృష్ణ వాట్ నాట్.. అని పెట్టి పుంఖాను పుంఖాలు రాసేది. ఆ ట్రెండ్ ఫాలో అయి కృష్ణమూర్తి, కృష్ణశర్మ, కృష్ణ స్వామి పోయి కృష్ణకాంత్‌లూ, కృష్ణ నిహాల్‌లూ, కృష్ణ సుకుమార్‌లూ వచ్చాయి.

ఆ తరువాత జయంతి, అన్నపూర్ణ, అనురాధా, స్వర్ణమంజరీ, జ్యోత్స్న, మీనా, లాంటి కావ్యనాయికలపేర్లు కూడా పాపులర్ అయ్యాయి.

మేము ఊహకి రాగానే, ఒక మగరచయిత, (మా గురువుగారు యండమూరి వీరేంద్రనాథ్ గారు) ఆడపిల్లల పేర్లలో ఒక విప్లవ సమర శంఖారావం తెచ్చారు. ప్రవల్లిక, రమ్యస్మిత, మధూలిక, మధువని, వేదసంహిత, సునాదమాల.. ఇలా. ఇంకేం వుందీ ఇంటింటా మొదటిసారి 'రమ్య'లు వెలిసారు. లక్ష్మీదేవి మొక్కు అన్నారు. తర్వాత 'సౌమ్య' అన్నారు. అదీ అమ్మవారి సహస్రంలో వుందన్నారు. ఏదైనా అందమైన పేర్లు స్కూళ్ళల్లో నమోదు అయ్యాయి.

మా ఫ్రెండ్ తన చిన్నప్పటి క్లాస్‌మేట్స్ గైరుబోయిన నాగేశ్వరమ్మనీ, దిట్టకవి శతపత్ర సుందరినీ తలచుకుంటూ వుంటాడు. అందమైన అమ్మాయిలకి, పదహారు ఏళ్ళ కావ్యనాయకలకి ఇలా శ్రీవిద్యాసమ్మలు, గోవిందమ్మలూ, లక్ష్మీ నరసమ్మలూ అని పెట్టడం (barbarious) బార్బేరియస్ కదూ!

మా క్లాస్‌లో అచ్యుతరావు అనే అమ్మాయి వుండేది. ఇప్పుడంటే తండ్రి పేరు చివర్న పెట్టుకుని 'అమృతారావు' అంటే ఫ్యాషన్ కానీ అప్పట్లో ఏడ్పించేవారు. చాలా కిరాతకంగా ఆడపిల్లలకి రాయుడూ, నారాయణా, భాస్కరం, వెంకట రత్నం అనీ మగపిల్లలకి 'పైడితల్లి' 'భద్రకాళీ', 'సీతారత్నం' అనీ పెట్టేవారు.

మా అబ్బాయికి 'అశ్వని' నక్షత్రం అని 'అశ్వనీ కుమార్' అని పెడ్తేనే 'అశ్వనీ' అని పిలుస్తే ఆడపిల్ల పేరని గోలగోల చేసాడు. 'అశ్వనీ దేవతలు మగాళ్ళు రా. దేవ వైద్యులు రా. సూర్యుడి కొడుకులు రా' అని నా పురాణ జ్ఞానం అంతా ఎంత కావిళ్ళతో గుమ్మరించినా వినలేదు. 'అశ్విన్' అని మార్చేసుకున్నాడు.

మొన్న నా స్నేహితురాలి మనవడికి 'అచింత్యశాస్త్రి' అని పేరు పెట్టారు. 'ఫ్యూచర్'లో వాడు పెరిగి పెద్దయి తల్లిదండ్రుల మీద ఎంత యుద్ధం చేస్తాడో వూహించేసుకున్నా.

ఆయిల్ క్లాత్ మీద, మూడ్ నెలల బూరె బుగ్గల 'వెంకటప్పయ్య శాస్త్రి' కాళ్ళూ చేతులూ ఆడిస్తుంటే ఎలా వుంటుందీ?

బుడి బుడి అడుగులతో, రబ్బరు బొమ్మలాంటి 'సోమ సుందరమ్మ' 'అత్త...తాత' అంటూ వస్తే ఏమని పిలుస్తారూ?

తాత ముత్తాతలూ, బామ్మల మీదున్న ప్రేమలు ఇలా పేర్లు పెట్టి చూపించాలా? పోనీ పేరు పెట్టి గౌరవంగా పిలుస్తారా? కోపం రాగానే "ఒరే వెంకటప్పయ్య వెధవా ఇలారా" అంటారు. ఆ సదరు వెంకటప్పయ్య భార్య, పూర్వ సువాసినీ, బామ్మగారు వంటింట్లో కంట నీరు పెడ్తుంది.

మా తాతమ్మ, మా రాము అన్నయ్యని 'ఒరేయ్' అని కానీ 'రామూ' అని పేరు పెట్టి పిలిచేది కాదు.. ఆవిడ భర్త పేరు కాబట్టి "అబ్బాయ్" అనో "బాబు" అనో, ఏహోయ్ అనో అనేది. 'రా' అనేది కాదు.

ఇందుమూలంగా ఇంటింటా ముద్దు పేర్లు వెలిసాయి. అవి ఎంత భయంకరంగా వుండేవంటే, 'గుండు', 'చెంబూ,' 'పాపాయి', 'పండూ,' 'నానీ', 'చిట్టీ', 'చిన్నీ', 'బుజ్జీ', 'బుడ్డీ'.. ఇంక వాడికి డెబ్భై ఏళ్ళు వచ్చినా 'బుజ్జీ' 'నానీ'నే.

ఓసారి మా ఇంటికి కరెంట్ బిల్ తీసుకొచ్చిన అతనితో మా నాన్నగారు 'మా పాపాయిని పిలుస్తా. నాకు ఈ లెక్కలు తెలీవు' అన్నారు.

"మీరింత పెద్ద మనిషయి వుండి, పాపాయిని ఎందుకు పిలుస్తారు?" అన్నాడతను.

పాపాయి అంటే మా అమ్మ.

కళ్ళద్దాలతో, జుట్టు నెరిసి, 'పాపాయి' అనగానే మా అమ్మ వస్తే అతను షాక్!! ఇలా వుంటాయి.

మాకు తెలిసిన వాళ్ళ పిల్లలకి అనుబంధం, ఆత్మీయత, ఆనందం అని పేర్లు పెట్టారు. ఒకరోజు నేను వాళ్ళింటికి వెళ్ళి 'అనుబంధం ఏది? ' అంటే 'అనుబంధం టాయిలెట్‌లో వుంది, ఆత్మీయత పక్కింటివాళ్ళతో గోడమీద కొట్లాడుతోంది, ఆనందం దేనికో కుళ్ళి కుళ్ళి ఏడుస్తోంది.' ఇదీ పరిస్థితి!!

కొన్నిసార్లు పేర్లు విని ఒకటి వూహించుకుంటాం. మనుషులు దానికి వ్యతిరేకంగా వుంటారు. ఉదాహరణకి పోచమ్మ అనే అమ్మాయిని ఒక సాఫ్ట్‌వేర్ కంపెనీలో హెచ్.ఆర్‌గా చూస్తే ఎలా వుంటుందీ?

ఒక శుభలేఖ వచ్చింది. పెళ్ళికొడుకు పేరు సోమయాజుల శర్మ, తండ్రి ప్రఫుల్ల కుమార్.

నిరంకుశంగా, మన చేతిలో పవర్ వుంది కాబట్టి, పిల్లలకి అలాంటి పేర్లు పెట్టడం ఏం న్యాయమండీ?

ఇంకా విపరీతపు కేసుల్లో, పిల్లలు పుట్టిపోతున్నారని, ఏదో మొక్కట.. పెంటయ్య, తుక్కు, చెత్త అని కూడా పెడ్తారట.

నాకో డ్రైవర్ వుండేవాడు. ప్రస్తుతం వున్నవాడికన్నా తెలివైనవాడు. 'అమ్మా నాకు కొడుకు పుట్టాడు. 'డు' అక్షరంతో పేరు రావాలి ఏం పెట్టనూ?' అన్నాడు.

పనిలో విసుగ్గా వున్న నేను 'డుకేష్' అని పెట్టరా' అన్నాను.

అంటే వాడెళ్ళి "డుకేష్" అని పెట్టాడు. నా కళ్ళముందే డుకేష్ పెద్దవాడౌతున్నాడు.

మొన్న నా మిత్రుడూ, ప్రముఖ డాక్టరు ఇంట్లో వాళ్ళ అమ్మాయి పెళ్ళికి వెళ్ళాను అల్లుడు పేరు 'బినోద్'. బెంగాలీ అనుకున్నాను కాదుట, వినోదేట కానీ 'బి'తో రావాలన్నారని అలా పెట్టారుట.

మా ఫ్రెండ్ ఒకడు, నేను టెంత్ క్లాసులో వున్నప్పుడు నన్ను ఆటపట్టించడానికి మా ఇంటికొచ్చి 'రమణమ్మగారూ ఏం చేస్తున్నారు? సినిమా కొస్తారా?' అన్నాడు.

అక్కడే వత్తులు చేసుకుంటున్న మా అమ్మమ్మ "వస్తానురా నాయనా.. ఖాళీగా వున్నాను" అంది. ఆవిడ పేరూ అదే వాడు 'ఝలక్' తిన్నాడు.

ఒక అమ్మాయి నాకు పెళ్ళి కార్డు ఇస్తే 'అబ్బాయి పేరు ఏవిటి?' అన్నా.

సిగ్గుపడుతూ 'చూడండి' అంది.

చూస్తే పుల్లయ్య. పాపం సూటు బూటులో భలే స్టైలుగా వున్నాడు. అమ్మాయి నాలుగేళ్ళు ప్రేమించి చేసుకుందిట. ప్రేమలకి పేర్లు అడ్డురావు కదా.

మనం కాసేపు పాతతరంలోకి వెళితే ఆ నవలల్లో దృశ్యాలు రొమేంటిగ్గా ఇలా వుండేవి అనుకుంట.

గోవిందమ్మ గోదారి గట్టుమీద నిలబడితే, ఆమె పైట గాలికి రెపరెపలాడ్తుంటే, సుబ్బరామయ్య గుండె గుబగుబలాడింది.

రామలింగయ్యతో "నిన్ను ప్రేమిస్తున్నాను" అంది అచ్యుతరామమ్మ.

దానికి అతను "అచ్యుతరామమ్మా... నీ పేరు వింటేనే నా తనువు పులకరిస్తోంది" అన్నాడు.

ఇంక విదేశాల్లో వున్న ప్రవాస భారతీయులు ఇంటిపేరు తప్పకుండా తగిలించుకుంటారు. చిన్నప్పుడు మనం దాచేసిన ఇంటి పేర్లు, చింతపెంట, పెంటపాడు, దగ్గుల, దద్దుర్ల, అన్నీ పైకొస్తున్నాయి.

'సౌమ్యారావు పెంట' అంటే వినడానికి ఎలా వుంటుంది చెప్పండి? కానీ తప్పదు. ట్రెండ్

సరే మా తరందాకా చెప్పాను. తరువాతి తరంలో కొన్ని స్థాయీభావాల పేర్లు 'కాదేదీ పేరుకి అనర్హం' అన్నట్టు పెట్టేసారు. ఉదాహరణకి వాత్సల్య.. ఆహ్లాద.. ఆశ్చర్య... ప్రేమవిహ్వల.. చిద్విలాసి.. క్రోధ లాంటివి. అన్నీ పొయెటిక్‌గా బానే వున్నాయి. రానాను వెర్రితలలు వేసింది. మా అన్నయ్య ఫ్రెండ్ కొడుక్కి 'నికాన్' అనీ, కూతురికి 'యాషికా' అనీ కెమెరా పేర్లు పెట్టాడు.

ఇంకోడు 'సన్‌లైట్' అని పెట్టాడు.

అదేంట్రా? అంటే 'సూర్యకాంతి' అన్నాడు.

ఇదివరకు వెంకటేశ్వరరావు, రామాంజనేయులు, ప్రసన్నకుమార్, కామేశ్వరి, పద్మావతి, రుక్మిణిలాంటి పేర్లు వుంటే తెలుగువాళ్ళనీ, నంబియార్, విశ్వనాథన్, ఇళవరసి, పంకజమ్మాళ్ లాంటి పేర్లు వుంటే తమిళులు అనీ, బిపిన్ చంద్ర బోస్, అర్చనా బరువా, బిపాసాబసూ, రబీంద్రనాథ్ అంటే బెంగాలీలు అనీ, ఇలా అర్థం అయ్యేది. కానీ రాను రాను భాషా బేధాలూ, దేశాంతర ఖండాంతర బేధాలు కూడా లేవు. పేర్లన్నీ కామన్. ట్రెండట.

అయాన్... అంటే గ్రీక్‌లో అందగాడు. 'బుస్' అంటే లాటిన్‌లో సూరుడు.. 'ఇష్' అంటే జర్మనీలో ఏదో.. 'ఫుచ్' అంటే అరబిక్‌లో మరో అర్థం..

నోటికొచ్చిన పేర్లు పెట్టేస్తున్నారు.

ఎంచక్కా దీపిక అని పేరు పెట్టి 'పీకూ' అంటారు. 'అలకనంద' అని పేరు పెట్టి 'లాగూ' అని పిలుస్తున్నారు. 'పీకూ', 'లాగూ'కి గ్రీక్‌లో, లాటిన్‌లో వుండే అర్థాలు మన తెలంగాణాలో, ఆంధ్రాలో, రాయలసీమలో తెలుస్తాయా? పీకూ అంటే పీకడం... లాగూ అంటే లాగడం అనేగా అర్థం అవుతాయి.

ఒకావిడ పాపని చూపించి, 'డిప్స' అంది. అరబిక్‌లో సముద్రదేవత అని అర్థమట.

"మీరు ఇంట్లో అరబిక్ మాట్లాడ్తారా?" అడిగాను.

"అబ్బే... మేం ఏలూరు వాళ్ళం."

"మరి మీ బంధువులు కానీ, మీవారి బంధువులు కానీ అరబ్‌లో వుంటారా?"

"లేదు.. అంతా ఆంధ్రాలోనే" అంది.

"మరి ఎవరికీ అర్థంకానీ, అస్సలు అందంగా లేని ఈ 'డిప్స' ఎందుకమ్మా? ఎంచక్కా ఏ ప్రియాంక పేరో పెట్టుకున్నా బావుండేదిగా" అన్నాను. ఆవిడకి కోపం వచ్చింది.

మా అన్నయ్య వాళ్ళింట్లో కుక్క పిల్లపేరు 'విస్కీ'. అది తలుపు తియ్యగానే తప్పించుకుని పక్కింట్లోకి వెళ్ళిపోతుంది. నిద్ర కళ్ళతో, మత్తుగా మా అన్నయ్య 'విస్కీ.. విస్కీ' అని అరుస్తూ ... ఇలా ప్రొద్దుటే ప్రక్కింటికి వెళ్తే ఎలా వుంటుంది ఆ ఇంటావిడకి చెప్పండి? ఇంకొకడి కుక్క పేరు 'కిస్'ట. అది ఎదురింటి అమ్మాయి మీద పడ్తే వీడు 'కిస్... కిస్.." అని ఆ అమ్మాయి మీదకి వెళ్తున్నాడు.

ఇప్పుడు మిస్ 'వీసా', మిసెస్ 'పానీ' అనే పేర్లంటే ఏ చైనీసో, అమెరికనో అనుకోకండి. మన పర్వతనేని పార్వతీశం మనవరాలు అయ్యుంటుంది. పేర్లు 'ఇంటర్నేషనల్' అయిపోయాయి. పేరు ఎంత స్టైలుగా పెట్టుకున్నా మనవాళ్ళు ఇంటిపేర్లు మాత్రం వదలరు. పాటిల్, బెనర్జీ, శర్మా, నాయుడూ, చౌదరీ, రెడ్డీ, మల్హోత్రా, సింఘానియా లాంటివి తప్పవు.

'వీర వెంకట నాగ ఆంజనేయ లక్ష్మీ కౌసల్యా కౌస్తుభ సచ్చిదానంద దత్త శ్యామల గౌరీ వీర వర సత్య భగవతీ అరవింద' అన్న పేర్లు పోయి సరస్వతీ, పార్వతి, సావిత్రీ, అనసూయా లాంటి పేర్లు వచ్చాయి. అవి పోయి పద్మజ, రమణి, కాంతి, లలిత లాంటి పేర్లు.. అవీ పోయి రమ్య, లిపి, హనీలాంటి రెండు అక్షరాల పేర్లు... చివరికి బద్ధకాలు ఎక్కువయి, టైములు తక్కువయి 'నై', 'సు', 'ప్ర' 'కో', 'చౌ' అనే పేర్లు వచ్చినా ఆశ్చర్యం లేదు. అయినా పేరు ఏవిటన్నది కాదు. వాడు పెరిగి పెద్దవాడై అబ్బకీ అమ్మకీ నాలుగు తేకూడదు అన్నది పాయింట్. మన పెద్దలు ఎంత పెద్ద పేర్లు పెట్టినా వాడు పెరిగి పెద్దవాడై తెచ్చుకునే పేరే అసలు పేరు.

ఆంధ్రుల ఆహ్లాదరచయిత మల్లాది వెంకటకృష్ణమూర్తిగారు వాళ్ళ పిల్లలకి 'కావ్య,' 'ఊహ', 'లిపి' అని (అంతవరకూ మేము వినని ఊహ, లిపి) అందమైన పేర్లు పెట్టారు. వాళ్ళ పిల్లల తరం వచ్చేసరికి మొన్ననే వాళ్ళ ఊహకి పాప పుట్టినప్పుడు 'నిసా' అని పెట్టారు. అది ఊహ, వాళ్ళాయన ఛాయస్. ఈ పేరు వినగానే ఇది తెలుగు పేరో, ఇంగ్లీష్ పేరో, రష్యన్ పేరో గ్రీకు పేరో తెలియదు. శబ్దం మాత్రమే చూసుకుంటున్నారు.

ఒకాయనకి వాళ్ళ పిల్లలకి వ్యంధ్య, స్వధ అని పేర్లు పెట్టాడు. వాటి అర్థాలు తెలుగులో చూస్తే అస్సలు బాగోవు.

'అబ్దుల్ కలామ్' అని ఆ తల్లితండ్రులు ఎంతటి గొప్పవేళ ఆ మహానుభావుడికి ఆ పేరు పెట్టారో కదా!

'థెరిసా' అని దైవానికి మారుపేరుగా ఆ పేరు ఎంత ప్రఖ్యాతి నొందిందీ?

'సచిన్ టెండూల్కర్' అని పేరు పెట్టినప్పుడు ఆ తల్లిదండ్రులకి తెలుసా ఇంత పొట్టివాడు అంత పెద్ద పేరు తెచ్చుకుంటాడని?

అలాగే ఇప్పటి ఈ 'ప్రకా', 'సీపా', 'చీకూ' 'సూ' 'జ..' లాంటి పేర్లు పెట్టుకున్న మన పిల్లలు ఏం పేరు తెచ్చుకుంటారో... మనకేం తెలుసు?

కడుపుతో వుండగానే 'ఇటాలియన్' గ్రీకు' 'రష్యన్' పేర్ల పుస్తకాలు తెప్పించుకుంటున్న ఈ తరం తెలుగు పిల్లల్లారా, కాబోయే తల్లితండ్రులారా వర్ధిల్లండి.

**శుభం భూయాత్.**




COMMENTS

